లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

- అర్హులను గుర్తించడంలో అధికారుల పాత్ర ప్రధానం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని తహసీల్దార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ , జనవరి 15 : ఈ నెల 26 నుంచి ప్రభుత్వ పథకాలను అందించనున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకతను పాటించాలని, అర్హులందరినీ గుర్తించడంలో అధికారులదే ప్రధాన పాత్ర అని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లాలోని తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై సర్వే, గ్రామ సభల నిర్వహణ, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విధివిధానాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలన్నారు. ఇందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుని ఆయా టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 16 నుంచి 20 క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభల నిర్వహణ, అనంతరం పది రోజుల వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. 21 నుంచి 25 వరకు డాటా ఎంట్రీ పూర్తి చేయాలని చెప్పారు. గ్రామ సభల్లో ఇందిరమ్మ గ్రామ కమిటీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. రైతు భరోసాను రూ.10వేల నుంచి 12వేలకు పెంచగా.. ఎకరాకు రూజ6వేల చొప్పున రెండు విడతలుగా డీబీటీ పద్ధతిలో అందించడం జరుగుతుందన్నారు. ఇందులో వ్యవసాయ యోగ్యం కాని, ఇండ్లు, కాలనీలుగా మారిన, ప్లాట్లు, రియల్ ఎస్టేట్‌గా మారిన భూములను భరోసా నుంచి తొలగించాలని ఆదేశించారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు రెండు విడతలుగా రూ.12వేలను అందిస్తుందన్నారు. ఇందుకు మహాత్మా గాంధీ జాతీయా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న భూమి లేని వ్యవసాయ కుటుంబాలు, కనిష్టంగా 20 రోజులు పనిచేసినవారు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ పేర్కొన్నారు.

గోపిగడ్డలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ యువ నేత పట్నం అవినాశ్‌రెడ్డి

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

- రైతు ధర్నాకు గ్రామాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ పార్టీ యువ నేత పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, జనవరి 15: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలు, రైతుల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుందని, ఈ నెల 17న షాబాద్‌లో నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ, గోపిగడ్డ, సీతారాంపూర్, పోతుగల్, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ, కొమరబండ తదితర గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న షాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే రైతు ధర్నా కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల నుంచి రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువకులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, మాజీ సర్పంచులు, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అయూబ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత పాత్ర అభినందనీయం

పరిగి డీఎస్పీ శ్రీనివాస్


బండవెల్కిచర్లలో ఆర్మీ సైనికుల సన్మాన సమావేశంలో పాల్గొన్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు

కులకచర్ల, జనవరి 15 : బండవెల్కిచర్ల గ్రామంలో దేశరక్షణలో యువత ఎక్కువగా ఉద్యోగాలు పొందడం అభినందనీయమని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో 60 మంది యువకులు ఆర్మీలో పని చేస్తున్నారు. వారి సన్మానానికి డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి డీఎస్పీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైనికులు దేశ రక్షణలో, సరిహద్దుల్లో పనిచేయడం ద్వారానే మనం సంతోషంగా ఉంటున్నామని తెలిపారు. వారిని గుర్తించిన భీంరెడ్డి సన్మానించడం ఆనందదాయకమని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని మరింత మంది యువకులు దేశరక్షణలో పనిచేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఆర్మీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పాంబండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శుక్లవర్ధన్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పాంబండ రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి

యాచారం, జనవరి 15 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల తీరుపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, అర్హులకు సంక్షేమ ఫలాలను అందించే తదితర విషయాల్లో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, మండల అభివృద్ధి అధికారి నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఏపీవో లింగయ్య, ఏపీఎం సుదర్శన్‌నెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ధారూరు, జనవరి 15 : లైఫ్ గార్డులకు కాయకింగ్ పోటీలతో శారీరక ఎదుగుదల, ఆనందాన్ని ఇస్తుందని నిర్వాహకుడు రాములు అన్నారు. బుధవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో కాయకింగ్ యాజమాన్యం బోటింగ్ సిబ్బందికి, లైఫ్ గార్డులకు కాయకింగ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వహకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న క్యామ మల్లేశ్

బీఆర్ఎస్ భవనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్

యాచారం, జనవరి 15 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బీఆర్ఎస్ భవనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన టీపీఎల్ సీజన్-4 క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. విజేతలకు మల్లేశ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. పోటీల ద్వారా క్రీడాకారుల నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించేందుకు అన్నివిధాల పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, నాయకులున్నారు.

నిమ్స్‌లో 2న రేడియాలజీ జాతీయ సదస్సు

ఖైరతాబాద్, జనవరి 15: నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ దివంగత ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శతజయంతి వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 2న సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్, నిమ్స్ రేడియాల విభాగాల ఆధ్వర్యంలో ఆ అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డా.నగరి బీరప్ప తెలిపారు. ఈమేరకు నిమ్స్‌లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను నిమ్స్ డీన్ డా.లీజారాజ శేఖర్, రేడియో డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డా.అనుకపూర్, రేడియాలజీ కళాశాల ప్రిన్సిపాల్ శీరందాస్ శ్రీనివాస్, ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకాడమిక్ డైరెక్టర్ డా.దామోదర నాయుడుతో కలిసి ఆవిష్కరించారు.

స్నేహ బంధం

సాయం చేసిన బాల్య స్నేహితులు

ప్రమాదం బారిన పడిన వెంకటయ్యకు ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య స్నేహితులు

కులకచర్ల, జనవరి 15 : కులకచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన గూళ్ల వెంకటయ్యకు గత నెల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం కులకచర్ల గ్రామానికి చేరుకోవడంతో కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల 1999-2000 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య స్నేహితులు ఆయనకు ఆర్థికంగా సహకరించేందుకు పూనుకున్నారు. తలా కొంత డబ్బును సేకరించి రూ.52వేలను బాధితుడి నివాసానికి వెళ్లి అందించారు. దీంతో వెంకటయ్య కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల్య స్నేహితులను పలువురు గ్రామస్తులు అభినందించారు.

పండుగ వేళ .. పైప్‌లైన్ పనులు పూర్తి

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన జలమండలి
- రోడ్లన్నీ ఖాళీ ఉండటంతో వేగంగా తాగు, మురుగునీటి పనులు

సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరంలో రోడ్లు ఖాళీగా ఉండటంతో ఈ అవకాశాన్ని జలమండలి అధికారులు తాగు, మురుగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టి సద్వినియోగం చేశారు. సాధారణ రోజుల్లో ఈ పనులు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండటంతో పండుగ సమయాన్ని సమస్యల పరిష్కారానికి కేటాయించి వేగంగా పనులు పూర్తి చేశారు. మూసాపేట రోడ్ క్రాసింగ్ పనులు, కేపీహెచ్‌బీ ఫోరం మాల్ సర్కిల్ దగ్గర సీవరేజీ పైపులైన్, మూసాపేట లోని అంజనేయ నగర్‌లో సీవరేజీ, బంజారా హిల్స్ రోడ్ నం.10 పైపులైన్ లీకేజీ, జగద్గిరి గుట్టలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఏర్పడ్డ లీకేజీని అరికట్టారు. ప్రగతినగర్‌లో నీటి సరఫరా పెంచడానికి గ్యాప్ క్లోజర్ పనులు నిర్వహించారు. పంజాగుట్ట క్రాస్‌రోడ్స్‌లో సీవరేజీ పైపులైన్ డ్యామేజ్ కావడంతో దానికి మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులను సంబంధిత సర్కిళ్ల జీఎంలు, సెక్షన్ మేనేజర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని, అధికారులను అభినందించారు.

కమనీయం..

వికారాబాద్‌లో షాపుల వద్ద సందడి

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నంలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. మహిళలు వేకువజామునే లేచి ఇండ్ల ముందు వివిధ రకాల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అలంకరించారు. పాలు పొంగించారు. డీజే సౌండ్ల మధ్య చిన్నారులు, యువత వివిధ ఆకృతులతో కూడిన పతంగులను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. పతంగులు, రంగుల కొనుగోలుతో దుకాణాలు కిక్కిరిసిపోయాయి. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొన్నది. - న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

షాద్‌నగర్‌లో..

వికారాబాద్‌లో..